క్లుప్తంగా

డ్రగ్స్‌రహిత సమాజం నిర్మించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ శ్రీదేవి

దేవరకొండ : డ్రగ్స్ రహిత సమాజం నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మట్టా శ్రీదేవి అన్నారు. మంగళవారం కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతను లక్ష్యంగా చేసుకొని మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నారని, యువత అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అంతకు ముందు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమారి

త్రిపురారం : మహిళలందరూ మహిళా సంఘాల్లో చేరి బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ విజయకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలోని మహిళా సంఘాల సభ్యులు ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు మహిళ సంఘాల సభ్యులు రుణాలను సకాలంలో బ్యాంకులకు చెల్లించి అధిక నిధులు పొందాలన్నారు. అనంతరం ఏపీఎం అశోక్ మాట్లాడారు. సమావేశంలో ఏపీఓ శ్యామల, సీసీలు దేవ్‌సింగ్, హేమ, మురళి, నాగమణి, పద్మ, నాగలక్ష్మీ, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని రాస్తారోకో



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

డిండి : మండల కేంద్రంలో కొన్ని నెలల నుంచి కొనసాగుతున్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక గాంధీ చౌరస్తా వద్ద గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రతి రోజు మండల కేంద్రంలో విద్యుత్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ సాయిప్రసాద్ వారి వద్దకు వచ్చి వారం రోజుల్లో సమస్య లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు. రాస్తారోకో చేపట్టిన వారిలో ఏటి.కృష్ణ, గిరమోని శ్రీను, గుర్రం సురేష్, బల్ముల తిర్పతయ్య, రశీద్, సాయిగౌడ్, మల్లయ్య, రవి, చాంద్‌పాషా, బాసిద్ తదితరులున్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ : కార్మిక, కర్షక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వెంకటేశ్వర్లు, రవినాయక్, పాండు ఉన్నారు.

బెల్ట్‌దుకాణాలు మూసివేయించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 48వవార్డు సీతారాంపురంలో నిర్వహిస్తున్న బెల్ట్‌దుకాణాలు మూసివేయించాలని, వాటి నిర్వహణతో మహిళలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం ఆ వార్డు మహిళలు మాజీ కౌన్సిలర్ పందిరి అనిత ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారిలో నాగమణి, శైలజరాణి, సైదా, వెంకన్న, నాగరాజు, విజయ్‌కుమార్, మంగమ్మ, వెంకమ్మ, యశోధ ఉన్నారు.

కేసు నమోదు

మిర్యాలగూడ టౌన్ : మద్యం మత్తులో అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై వచ్చి పోయే వాహనాలు నిలుపుదల చేసి హల్ చేసిన వ్యక్తులపై మంగళవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. వేములపల్లికి చెందిన అక్షయ్ తన మిత్రుడైన మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన శివ వద్దకు వచ్చాడు. అయితే అక్షయ్ మద్యం సేవించి గ్రామంలోని రహదారిపై అర్ధరాత్రి హల్ చేయడంతో శివ, అక్షయ్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

వైఎస్సార్ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ : వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



మిర్యాలగూడ : వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దేవరకొండ : రైతుల అభ్యున్నతి, పేదల సంక్షేమం, మహిళా సాధికారత, విద్యార్థుల భవిష్యత్ కోసం వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో దివంగత మాజీ సీఎం వైఎస్సార్ 76వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, పున్న వెంకటేశ్వర్లు, మన్మంతు వెంకటేష్‌గౌడ్, ఆలంపల్లి నర్సింహ, రుక్మారెడ్డి, వేమన్‌రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, రాంసింగ్, హరికృష్ణ, గోవిందు, నజీర్ ఉన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

మిర్యాలగూడ : పట్టణంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా బంగారుగడ్డ కాలనీలో గల వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. మహానేత వైఎస్ఆర్ సంక్షేమ పాలన ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలలో మంగళవారం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్, కురుమేడు గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ఆదర్శ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. నేటి యువత రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు పానుగంటి రాము, గూడెల్లి కోటేష్, గజ్జల మల్లారెడ్డి, గునుకుల నరేష్, కొప్పుల నరేష్, కొప్పుల శ్రీనాథ్ పాల్గొన్నారు.

మహానేత 'వైఎస్సార్' సేవలు మరువలేనివి



హాలియా : వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చింతపల్లి : వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ అభిమానులు

హాలియా : దివంగత మాజీ సీఎం వైఎస్సార్ సేవలు మరువలేనివని కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలో అనుముల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత సీఎం వైస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ సలహాదారు పిల్లి ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ పాంపాటి శ్రీనివాస్, మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మజహర్ మైనోద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొర్ల ఈదయ్య, నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు షేక్ అన్వరుద్దీన్, నకిరేకంటి సైదులు మాదిగ, సంద్ర వెంకటయ్య, నాగిరెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావాలి



పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థుల తల్లిదండ్రులు

నాగార్జునసాగర్ : ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావాలని పూర్వ విద్యార్థుల అసోషియేషన్ (1968–69 టెన్త్‌బ్యాచ్) అధ్యక్షుడు రిటైర్డ్ డీఐజీ జీజె.మురళి అన్నారు. మంగళవారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం పాఠశాల హెచ్‌ఎం శేషు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులతో పాటు 1968–69 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. అదే విధంగా పూర్వ విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనంతరాములు, పురుషోత్తం, రిటైర్డ్ ఎంఈఓ ఈశ్వరయ్య, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు



దేవరకొండ : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో నియోజకవర్గానికి చెందిన 427మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1కోటి 71లక్షల 39వేల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, దళారులను నమ్మి మోసపోకూడదని అన్నారు. అనంతరం కొండమల్లేపల్లి మండల పరిధిలో గల పెండ్లిపాకల రిజర్వాయర్ ముంపు బాధితులైన పత్యతండా రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నష్టపరిహారం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో భూసేకరణ అధికారి లీల, డీఈ నెహ్రూచౌహాన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు ఆలంపల్లి నర్సింహ, నల్లగాసు జాన్‌యాదవ్, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, ముక్కమళ్ల వెంకటయ్య గౌడ్, రుక్మారెడ్డి, యూనూస్, గోవిందుయాదవ్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, పున్న వెంకటేష్, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, తదితరులున్నారు. మండల పరిధిలో గల తెలుగుపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదవాడి సొంతింటి కళను నిజం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రుక్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వేణుధర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, వెంకటయ్య, కృష్ణ, తదితరులున్నారు.

భూములపై హక్కులు కల్పించాలి

చందంపేట : పేదలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులకు సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో అదనపు కలెక్టర్, ఆర్డీఓ, అటవీ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపుతూ సమస్యను జఠిలం చేయొద్దని అన్నారు. నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ రమణారెడ్డి, ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులు సాగర్ జలాశయంలోకి వెళ్లొద్దు

నాగార్జునసాగర్ : శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వరద వస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు సాగర్ జలాశయంలోకి వెళ్లొద్దని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ సూచించారు. సాగర్ జలాశయతీరంలో గల పుట్టీలను, జలాశయంలోని వలలను త్వరితగతిన బయటకు తీసుకోవాలని, అలాగే రైతులు జలాశయంలో మోటార్లు వేసుకొని ఉంటే వాటిని పైకి తెచ్చుకోవాలన్నారు. ఈ మేరకు ఆయా మండలాల తహసీల్దార్లు గ్రామాల్లోని అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.

చెంచుల ఆరోగ్యానికి 'పీఎం జన్మన్'

చందంపేట : చెంచు గ్రామాల్లో చెంచుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ పథకాన్ని అమలు చేస్తోంది. 2024 నవంబర్‌లో మొదలైన ఈ పథకంలో భాగంగా నెలకు మూడు రోజుల పాటు చెంచు గ్రామాల్లో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులను అందజేస్తున్నారు. మండలంలోని పాగిళ్ల, రేకులవలయం, కంబాలపల్లి, చిత్రియాల, గన్నెర్లపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో 630మంది చెంచు కుటుంబాలు ఉండగా ఆయా గ్రామాల్లో చెంచులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తూ మందులను అందజేస్తున్నట్లు, మంగళవారం గన్నెర్లపల్లి చెంచుకాలనీలో చెంచులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యాధికారి హిమవర్ష తెలిపారు.

టీబీవ్యాధిపై అవగాహన

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్, జేత్యతండా, బాపూజీనగర్‌లలో టీబీ ముక్త్ భారత్ 100రోజుల కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణబాయి, ఎంఎల్‌హెచ్ పి.తేజస్విని, సునిత, పద్మ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన మోహనాచారి అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. మోహనాచారికి భార్యాపిల్లలు లేకపోవడం, తండ్రి గతంలోనే మృతిచెందడంతో అతడి తల్లి ప్రమీల ఒంటరైంది. నిరుపేద అయిన ప్రమీలను ఆదుకునేందుకు గ్రామంలోని వాసు సేవా సమితి సభ్యులు మంగళవారం రూ.12,500 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, గ్రామ యువకులు రవి, శ్రీను, నాగరాజు, రమేష్ ఉన్నారు.

10న నామినేషన్ల స్వీకరణ

మిర్యాలగూడ టౌన్ : విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ నూతన కార్యవర్గం ఏర్పాటు కోసం ఈ నెల 10న నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అన్నభిమోజు నాగార్జునచారి తెలిపారు. మంగళవారం పట్టణంలోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం మాజీ పట్టణ అధ్యక్షుడు గడగోజు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోవర్ధనాచారి, శ్రీనివాసాచారి, ఈశ్వరాచారి, దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



రైతులకు కంది చిరుసంచులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ : రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సార్రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా అడవిదేవులపల్లి, దామరచర్ల, మాడ్గులపల్లి మండలాల రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద కందులు, చిరు సంచులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ ధీరావత్ సైదా నాయక్, ఏఓలు శివరాంకుమార్, రుషేంద్రమణి, సరిత, ఏఈఓలు సైదులు, పార్వతి, ప్రియాంక, నరేష్, లావణ్య, రమేష్‌రెడ్డి, ఆఫ్రీన్, రైతులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు దరఖాస్తులు చేసుకోవాలి

మిర్యాలగూడ : ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోని దివ్యాంగులు, వితంతువులు ఆగస్టు 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండ్లులేని వితంతువులు, దివ్యాంగులకు ఆగస్టు 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినందున ఆయా మండలాల్లో ప్రజలందరికి అవగాహన కలిగేలా మండల అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించాలన్నారు. అర్హుల జాబితాలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆయా మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

మిర్యాలగూడ అర్బన్ : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, డీఎస్పీ కె.రాజశేఖర రాజు అన్నారు. పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ మైదానంలో మిర్యాలగూడ డివిజన్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఫొటోగ్రాఫర్ల మానసిక ఉల్లాసానికి ఈ క్రీడలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మర్రి ఎలియాస్, చక్రి, కృష్ణ, శ్రీమన్నారాయణ, లక్ష్మణ్, నాగార్జున, వెంకన్న, కర్ర శ్రీనివాసరెడ్డి, సైదులు, పిపాయి, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : వర్షాభావ పరిస్థితుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది, వార్డు ఆఫీసర్లు, జవాన్లు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా వైద్య సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కేసా రవితో కలిసి ఆయన మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇండ్లలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అదే విధంగా ప్రతి వార్డుల్లో వార్డు ఆఫీసరు, వైద్య సిబ్బంది సమన్వయంతో పర్యటించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రై డే అండ్ డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రపంచ మలేరియా, డెంగీ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. సమావేశంలో ప్రకాశ్‌నగర్, బంగారుగడ్డ పీహెచ్‌సీ డాక్టర్లు జానకిరాములు, పుతిన్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్ఓ, మేనేజర్ జ్ఞానేశ్వరీ, శానటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేతారెడ్డి, పోతేపాక బక్కయ్య, శంకర్, వివిధ శాఖల అధికారులు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికావిద్యకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం



గుర్రంపోడు : కేజీబీవీలో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న డీఎస్‌హెచ్‌ఓ అనంతరెడ్డి

గుర్రంపోడు : బాలికా విద్యకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పట్టు ఉద్యానవనశాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి అన్నారు. మంగళవారం గుర్రంపోడు కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజన ఏజెన్సీ వారికి పలు సూచనలు చేశారు. విద్యార్థినులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని మంచి పేరు సాధించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శైలజ, మండల విద్యాధికారి నోముల యాదగిరి, కేజీబీవీ ఎస్ఓ విజయశ్రీ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

మాడుగులపల్లి : కస్తూరిబా గాంధీ విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటమ్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను పాటిస్తూ విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని హౌజింగ్ పీడీ, మండల ప్రత్యేక అధికారి ఎస్‌పీ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు పట్టికలు, మధ్యాహ్న భోజనాన్ని, వంట గది పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 10న కేజీబీవీలో నూతనంగా నిర్మించిన ఇంటర్మీడియట్ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మానె ఉమాదేవి, ఎంఈఓ తరి రాములు, ఎస్ఓ జ్యోత్స్న, సీఆర్పీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

మిర్యాలగూడ : ప్రభుత్వ ప్రకటించిన మెనూను పాఠశాలలో సక్రమంగా అమలు చేయాలని దామరచర్ల తహసీల్దార్ బానోతు జవహర్‌లాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాలలో రోజువారీగా ప్రకటించబడిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన పౌష్టికాహారం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలు, మూత్రశాలలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డిజిటల్ పద్ధతిలో విద్యాబోధన చేయడంతో కఠినమైన అంశాలు కూడా సులభంగా విద్యార్థినులకు అర్థమవుతాయని, ఉపాధ్యాయులు బోధన అభ్యసన ప్రక్రియలో విరివిగా డిజిటల్ తరగతులను వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ ఎం.బాలాజీనాయక్, ప్రత్యేక అధికారిణి కవిత తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలి


- సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ : పట్టణంలో, మండల పరిధిలో అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బీఎల్ఓ యాప్ తదితర అంశాలపై బీఎల్ఓలకు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బీఎల్ఓ తమ ప్రాంతంలోని అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండి ఫామ్ 6,7,8లకు సంబంధించి ఓటర్ల నమోదుపై అవగాహన ఏర్పరుచుకొని క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తప్పులు లేని పరిపూర్ణమైన ఓటర్ల జాబితాను నమోదు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శర్మ, ఎన్నికల డీటీ ప్రవీణ్, మాస్టర్ ట్రైనర్స్ గుడిపాటి కోటయ్య, పోలెబోయిన జనార్దన్, అంబటి శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, సైదిరెడ్డి, ఉస్మాన్, సిబ్బంది సత్యనారాయణ, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి



డిండి : మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

డిండి : ఓటరు జాబితాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేందుకుగాను బీఎల్ఓ ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి బీఎల్ఓలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్ఓలకు ఓటరు జాబితా తయారుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో నూతన ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, 18సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్‌లు కె.శ్రీనువాసులు, శేఖర్, రమేష్, గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఏఎమ్మార్పీ' రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- సాగర్ జలాశయంలోకి చేరుతున్న నీరు
- సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు



గుర్రంపోడులో సిద్ధంగా ఉన్న నారుమడి

గుర్రంపోడు : సాగర్ జలాశయానికి చేరుతున్న నీటితో ఏఎమ్మార్పీ ఆయకట్టు రైతుల్లో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాదిలాగానే ఆగస్టులోనే నీటి విడుదల జరుగుతుందని వరినారు మడులు ముందస్తుగా సిద్ధం చేస్తున్నారు. సాగర్ జలాశయంలో సరిపడా నీరు చేరని సందర్భాల్లో ఏఎమ్మార్పీ ఆయకట్టులో నీటి విడుదల ఆలస్యమవుతూ మీమాంస నెలకొంటుంది. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల చేసినా ఏఎమ్మార్పీ ఆయకట్టుకు మాత్రం నీటి విడుదలలో తీవ్ర జాప్యం జరిగిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ఆయకట్టులో నార్లు ముదిరి రైతులు నష్టపోయేవారు. ప్రస్తుతం సాగర్‌కు చేరుతున్న నీటితో ఈ సారి ఏఎమ్మార్పీ ఆయకట్టులో పూర్తిస్థాయిలో సాగు కానుందని కొండంత ఆశతో సిద్ధమవుతున్నారు.

డివిజన్ పరిధిలో 90వేల ఎకరాల ఆయకట్టు..

గుర్రంపోడు డివిజన్ పరిధిలో గల గుర్రంపోడు, కనగల్, తిప్పర్తి మండలాల పరిధిలో 90వేల ఎకరాల ఏఎమ్మార్పీ ఆయకట్టు ఉంది. ఏఎమ్మార్పీ నాలుగు డివిజన్‌లలో గుర్రంపోడు డివిజన్ ఆయకట్టు పెద్దదిగా ఉంది. గుర్రంపోడు మండలంలో 32వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మండల పరిధిలో ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 14కిలోమీటర్ల పొడవు ఉంటుంది. డి-16 నుంచి డి-32 వరకు డిస్ట్రిబ్యూటరీలు అన్ని డివిజన్ పరిధిలోకి వస్తాయి.

వరిసాగుకే రైతుల మొగ్గు..

వరికి ప్రభుత్వం కల్పిస్తున్న బోనస్, కొనుగోలు కేంద్రాలతో అన్ని పంటల కంటె వరిసాగు లాభదాయకంగా ఉందని రైతులు అంటున్నారు. గతంలో వరికి ప్రత్యామ్నాయ పంటగా ఇతర పంటల సాగుకు మొగ్గు చూపే రైతులు పండ్లతోటల లాంటి పంటలు సాగు చేసే వారు కూడా వాటిని తొలగించి వరిసాగు చేస్తున్నారు. దీంతో పత్తి పంట విస్తీర్ణం ఏటేటా తగ్గుతుంది. మండలంలో గతంలో అత్యధికంగా 50వేల ఎకరాలు సాగు చేయగా గత ఏడాది 40వేల ఎకరాలకు తగ్గింది. ఈ సారి మరింతగా పత్తి సాగు తగ్గనుంది. ఏఎమ్మార్పీ నీటితో పత్తి చేలు జాలు పడుతుండడంతో చాలా మంది పత్తి వేసిన భూముల్లో కొత్తగా వరిసాగుకు సిద్ధమవుతున్నారు.

ఈ సారైనా చివరకు నీరు అందేనా..

గతంతో పోలిస్తే ఏఎమ్మార్పీ ఆయకట్టులో మేజర్‌కాల్వల వెంట కంపచెట్లను గత యాసంగి సీజన్‌లో తొలగించడంతో కాల్వలు శుభ్రంగా కనిపిస్తున్నాయి. మండల పరిధిలో 110కిలోమీటర్ల పొడవునా గల మేజర్ కాల్వల వెంట కంపచెట్ల తొలగింపు జరిగినా మరో వంద కిలోమీటర్ల పొడవునా మైనర్ కాల్వల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా కొప్పోలు, చేపూరు, మొసంగి పరిధిలో నల్ల మట్టి నేలల్లో కాల్వలు కోతకు గురై ఆనవాళ్లు లేకుండా ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.